కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -235 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 05-09-2026 శనివారం పేజీలు : 4




# సీఎం కుర్చీపై కవిత కన్ను!

**న్యూస్ డెస్క్, 04 సెప్టెంబరు (బిఎన్ఎస్):** కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో మరోసారి హాట్ టాపిక్‌గా మారాయి. తన రాజకీయ భవిష్యత్‌పై కీలక వ్యాఖ్యలు చేసిన కవిత.. తాను తెలంగాణ ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నానని బహిరంగంగా వెల్లడించారు. అంతేకాదు.. తన రాజకీయ ప్రత్యర్థులకు సవాల్ విసురుతూ.. హరీశ్‌రావు భార్య తనపై పోటీ చేస్తే స్వాగతిస్తానని పేర్కొన్నారు. కవిత చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి. హైదరాబాద్‌లో తెలంగాణ ఇంటర్ విద్య జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సేవ్ ఇంటర్ ఎడ్యుకేషన్' సదస్సులో పాల్గొన్న కవిత.. ఈ వ్యాఖ్యలకు తెరలేపారు. ఈ సందర్భంగా ఆమె తన రాజకీయ లక్ష్యాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. తాను సీఎం కావాలనుకుంటున్నా అని స్పష్టం చేసిన కవిత.. ముఖ్యమంత్రి పదవి కేవలం అధికారానికి సంబంధించినది కాదని, ఆ పదవికి గౌరవం, హుందాతనం కూడా ఉండాలని వ్యాఖ్యానించారు.

మిగతాది 2 లో..

- హరీశ్ భార్యకు సవాల్
- ఎవరొచ్చినా రెడీ అన్న కవిత
- రేవంత్‌పై తీవ్ర విమర్శలు
- సీఎం పదవికి హుందాతనం ఉండాలి
- ఇంటర్ రద్దు ఆలోచన విరమించాలి
- విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమా?
- ఆకునూరి మురళి కమిషన్‌పై ఫైర్
- కవిత వ్యాఖ్యలపై రాజకీయ దుమారం

# మున్సిపల్ ఎన్నికలకు బిగ్ అప్డేట్!

ఫొటో ఓటర్ల జాబితా విడుదల
58 అర్బన్ లోకల్ బాడీల్లో జాబితా
1,971 వార్డుల ఓటర్ల వివరాలు
ఆన్‌లైన్‌లో పేరు చెక్ చేసుకోండి
మిగతా ప్రాంతాల జాబితాలు త్వరలో
ఎన్నికల ప్రక్రియపై రాజకీయ చర్చ




**న్యూస్ డెస్క్ 04 సెప్టెంబరు (బిఎన్ఎస్):** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ దిశగా రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన కీలక ప్రక్రియకు శ్రీకారం


# మృత్యుంజయులుగా ఇద్దరు కార్మికులు!




న్యూస్ డెస్క్, 04 సెప్టెంబరు (బిఎన్ఎస్): నేపాల్ వరదల్లో కనిపించకుండా పోయినవారి కోసం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కొంతమంది ప్రాణాలతో బయటపడటంతో ఆశ్చర్యం కలిగిస్తోంది.

# ఆకాశంలో భారత్ మరో అడుగు!

GSLV-F17 ప్రయోగం గ్రాండ్ సక్సెస్
కక్ష్యలోకి EOS-05 ఉపగ్రహం
సరిహద్దులపై ఇక డేగకన్ను
శత్రు కదలికలపై నిఘా
రక్షణ వ్యవస్థకు శాటిలైట్ బలం
విపత్తులను ముందే పసిగట్టే టెక్నాలజీ
వాతావరణ అంచనాల్లో కీలక పాత్ర




**న్యూస్ డెస్క్ 04 సెప్టెంబరు (బిఎన్ఎస్):** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో సక్సెస్‌ను సొంతం చేసుకున్నది. అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. ఈ ప్రయోగం ద్వారా 2,367 కిలోల బరువు కలిగిన ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (EOS-05) ఉపగ్రహాన్ని శాస్త్రవేత్తలు విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. అంతరిక్ష ప్రయోగాల్లో సుదీర్ఘ చరిత్ర కలిగిన ఇస్రోకు జీఎస్ఎల్వీ సిరీస్‌లో ఇది 19వ రాకెట్ ప్రయోగం కావడం విశేషం.

# పసికందుపై పైశాచికం




మూడు నెలల పసికందుపై దారుణం
తెలిసిన వ్యక్తే కీచకుడిగా మారాడు
ఆడిస్తానంటూ తీసుకెళ్లి అఘాయిత్యం
రక్తస్రావంతో ఆస్పత్రికి చిన్నారి
వైద్యుల నిర్ధారణతో వెలుగులోకి ఘటన
నిందితుడు జితేంద్ర అరెస్ట్
చిన్నారి పరిస్థితి విషమం

# కృష్ణా జలాలపై మళ్లీ పంచాయతీ!




శభక్తిలో అసద్.. మోడీ, షాలకు తక్కువ కాదు
పాతబస్తీ అభివృద్ధిపై అసద్‌తో చర్చించా
స్టీల్ బ్రిడ్జికి గత ప్రభుత్వం నయా పైసా ఇవ్వలేదు
పాతబస్తీ గల్లీల్లోకి వచ్చింది నేనే
ఓల్డ్ సిటీ అభివృద్ధికి వెంటనే నిధులు
పేదలకు ఇందిరమ్మ ఇళ్లు.. లక్ష ఇళ్ల లక్ష్యం

# ఎవరిపై వేటు.. ఎవరికి పీఠం?

కేబినెట్ ప్రక్షాళనకు రంగం సిద్ధం
మూడు ఖాళీ స్థానాలపై ఫోకస్
పనితీరు లేని మంత్రులపై వేటు?
7 తర్వాత ఢిల్లీకి రేవంత్
విస్తరణా.. పునర్వ్యవస్థీకరణా?
బీసీ కోటాలో విజయశాంతి పేరు!
మంత్రి పదవుల కోసం నేతల లాబీయింగ్




న్యూస్ డెస్క్, 04 సెప్టెంబరు (బిఎన్ఎస్): కొండా సురేఖను కేబినెట్ నుంచి తప్పించిన నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ లేదా ప్రక్షాళన జరుగుతుందన్న ప్రచారం జోరందుకున్నది. ఇప్పటికే రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉండగా, సురేఖ బర్తరఫ్‌తో మరో స్థానం ఖాళీ అయింది. ఈ మూడు స్థానాలను భర్తీ చేయకుండా అలాగే ఉంచడం వల్ల విమర్శలు రావడంతోపాటు, ఆశావహుల నుంచి విమర్శలు వచ్చే ప్రమాదం ఉండటంతో విస్తరణ చేపట్టాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తున్నట్లు తెలిసింది. అయితే పనితీరు సరిగా లేని మంత్రులను తొలగించి, ఆ స్థానాల్లో కొత్తవారికి అవకాశం ఇవ్వడంతో పాటు మంత్రుల శాఖలను మార్చితే ఏ విధంగా ఉంటుంది అనే కోణంలో సైతం ఆరా తీస్తున్నట్లు సమాచారం.

**వారం తరువాత ఢిల్లీకి సీఎం..**

ఈనెల 7 నుంచి మూడు లేదా నాలుగు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు ఉన్నాయి. సమావేశాలు ముగిసిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డిని ఢిల్లీకి రావాలంటూ కాంగ్రెస్ అధిష్టానం ఆదేశించినట్లు తెలిసింది. ఆ పర్యటనలో ప్రధానంగా కేబినెట్ విస్తరణ చేపట్టాలా? లేక పునర్వ్యవస్థీకరణ చేయాలా? అనే అంశాలపై చర్చించే అవకాశం ఉంది. అయితే ఖాళీగా ఉన్న మొత్తం మూడు స్థానాల్లో ఎవరెవరిని తీసుకోవాలనే అంశంపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

# రెడ్ బుక్‌పై జగన్ ఫైర్!

లోకేష్‌కు జగన్ ఘాటు కౌంటర్
అక్షరాస్యత లెక్కలు తప్పంటూ విమర్శలు
2026 గణాంకాలు రాకుండానే 82.1% ఎలా?
2025లో అక్షరాస్యత 71.4 శాతమే
ప్రభుత్వం.. కేంద్ర గణాంకాల్లో తేడాలపై ఫైర్

2 లో

# మరుగుతున్న మహాసముద్రం

'గాడ్జిల్లా ఎల్‌నినో' ముప్పు
సగటు కంటే 2.6°C పెరిగిన ఉష్ణోగ్రత
లోతుల్లో 8°C దాటిన వేడి
భారత్‌పై ఎల్‌నినో పంజా
వర్షాభావానికి ముప్పు..ఇప్పటికే 16% లోటు
2027లో రికార్డు స్థాయి వేడి?
ప్రపంచానికి డబ్ల్యూఎంఓ హెచ్చరిక



**న్యూస్ డెస్క్, 04 సెప్టెంబరు (బిఎన్ఎస్):** పసిఫిక్ మహాసముద్రంలో వేడి ప్రమాదకర స్థాయికి చేరుతోంది. ఈ వేడి మరింత పెరిగితే ఈ ఏడాది చివరి నాటికి ఇప్పటివరకు నమోదైన అతిపెద్ద రాక్షస 'గాడ్జిల్లా ఎల్‌నినో'ల్లో ఒకటిగా మారే అవకాశం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) హెచ్చరించింది. ఈ ఏడాదంతటా ఇది మరింత బలపడి 2027, ఫిబ్రవరి వరకు కొనసాగుతుందనే అంచనాకు 100 శాతం అవకాశం ఉందని డబ్ల్యూఎంఓ స్పష్టం చేసింది. గురువారం విడుదల చేసిన తాజా అప్‌డేట్‌లో డబ్ల్యూఎంఓ ఈ స్థాయిలో అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం ఇదే తొలిసారి.

2 లో

# సురేఖకు బీఆర్ఎస్‌లో చోటు లేదు!

తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వం
పార్టీ మారిన వారిని తిరిగి చేర్చుకోం
కాంగ్రెస్ నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు టచ్‌లో
రాజగోపాల్ రెడ్డిని అసలు తీసుకోం
మంత్రి పదవి ఇస్తే అమ్ముడుపోయినట్టే
కాంగ్రెస్‌పై పోరుకు బీఆర్ఎస్ వ్యూహం
అసెంబ్లీ సమావేశాల్లో సర్కార్‌ను టార్గెట్ చేస్తాం


2 లో

# 'బిలాంగింగ్'పై ఫుల్ క్లారిటీ!

సోనియా పుస్తకానికి కొత్త పబ్లిషర్
హార్పర్ కాలిన్స్ చేతికి 'బిలాంగింగ్'
నవంబర్ 10న పుస్తకం అధికారిక విడుదల
పెంగ్విన్‌తో డీల్ రద్దు.. కొత్త మలుపు
స్క్రిప్ట్ మార్పులపై విభేదాలతో ఒప్పందం రద్దు
రాజీవ్‌తో పరిచయం నుంచి రాజకీయ ప్రస్థానం వరకు

2 లో

# రెడ్ బుక్‌పై జగన్ ఫైర్!



**న్యూస్ డెస్క్, 04 సెప్టెంబరు (బిఎన్ఎస్):** అక్షరాస్యతపై లోకేష్ లెక్కలు తప్పంటూ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఎక్స్ వేదికగా విమర్శించారు. కూటమి సర్కార్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2026 అక్షరాస్యత గణాంకాలే ఇంకా విడుదల కాలేదని, అలాంటప్పుడు 2026లో 82.1 శాతం ఎలా వచ్చిందని ప్రశ్నించారు. 2024లో ఏపీ అక్షరాస్యత 72.6 శాతమేనని వెల్లడించారు. 2025లో అక్షరాస్యత మరింత తగ్గిందని అభిప్రాయపడ్డారు. 2025లో ఏపీ అక్షరాస్యత 71.4 శాతంగా నమోదైందని తెలిపారు. 2025 PLFS నివేదిక జులై 2, 2026న విడుదల చేశారని తెలిపారు. 2018-19లో అక్షరాస్యత 69.1 శాతంగా ఉందని గుర్తు చేశారు. 2024 నుంచి 2025కు అక్షరాస్యత పెరగలేదని తగ్గిందని తెలిపారు.

71.4% నుంచి అక్షరాస్యత 82.1% ఎలా పెరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ గణాంకాలకు.. కేంద్ర గణాంకాలకు తేడా ఉందని అన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో చేరికలు తగ్గుతున్నాయని.. ప్రైవేట్ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ పెరుగుతోందని తెలిపారు. UDISE గణాంకాలు ఇదే విషయాన్ని చెబుతున్నాయన్నారు. పేద, బలహీన వర్గాల పిల్లల విద్యపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. రెడ్ బుక్ పాలనపై కాకుండా విద్యాశాఖపై దృష్టి పెట్టాలని కౌంటర్ ఇచ్చారు. అక్షరాస్యతపై తప్పుడు లెక్కల ప్రచారం ఆపాలని కోరారు.

# మున్సిపల్ ఎన్నికలకు బిగ్ అప్డేట్!

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియను ముమ్మరం చేస్తూ, తొలి విడతగా పలు కీలక ప్రాంతాలకు సంబంధించిన ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెల్లడించిన వివరాల ప్రకారం, మొత్తం 58 అర్బన్ లోకల్ బాడీలు, విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని ఫొటో ఓటర్ల జాబితాను అధికారులు అందుబాటులోకి తెచ్చారు. ఈ పరిధిలోని మొత్తం 1,971 వార్డులకు సంబంధించిన ఓటర్ల తుది/సవరించిన జాబితాలను స్థానిక ఎన్నికల కార్యాలయాలు, అధికారిక పోర్టల్ ద్వారా ప్రకటించారు.

**ఓటర్ల జాబితాలో పేర్లను చెక్ చేసుకునేందుకు ప్రత్యేక లింక్..**

అయితే, విడుదల చేసిన ఈ తాజా జాబితాలో మీ పేరు ఉందో లేదో ఓటర్లు సులభంగా సరిచూసుకోవచ్చు. తమ పేర్లను పరిశీలించుకోవడానికి, వివరాలను తెలుసుకోవడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేక లింక్ https://sec-ems.ap.gov.in/apsec/అందించింది. ఓటర్లు ఇక్కడ క్లిక్ చేయడం ద్వారా ఆన్‌లైన్‌లో తమ ఓటరు వివరాలను చెక్ చేసుకోవచ్చు. ప్రస్తుతం మొదటి విడతగా కొన్ని అర్బన్ లోకల్ బాడీలు, విజయనగరం కార్పొరేషన్‌కు మాత్రమే ఓటర్ల జాబితా విడుదల కాగా.. రాష్ట్రంలోని మిగతా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు చెందిన ఓటర్ల జాబితాలను కూడా త్వరలోనే విడుదల చేయనున్నట్లుగా ఎన్నికల సంఘం తెలిపింది. మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై సర్వత్రా ఆసక్తి నెలకొన్న తరుణంలో రాష్ట్ర ఎన్నికల సంఘం వరుస ప్రకటనలు చేస్తుండటంతో రాజకీయ వర్గాల్లోనూ చర్చ మొదలైంది.

# ఆకాశంలో భారత్ మరో అడుగు!

మొదటి పేజీ తరువాయి

**దేశ రక్షణ వ్యవస్థలో అత్యంత కీలకం..**

కక్ష్యలోకి చేరిన EOS-05 ఉపగ్రహం భారతదేశ రక్షణ వ్యవస్థకు అత్యంత కీలకంగా మారనుంది. ప్రధానంగా దేశ సరిహద్దుల పర్యవేక్షణలో ఈ శాటిలైట్ ఓ డేగకన్నులా పనిచేస్తుంది. సరిహద్దు వెంబడి జరిగే మార్పులను పసిగట్టడంతో పాటు, శత్రు దేశాల కదలికలను ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తూ భద్రతా దళాలకు అత్యంత కీలకమైన సమాచారాన్ని అందిస్తుంది. దీనివల్ల దేశ భద్రత మరింత పటిష్టం కానుంది. అయితే, కేవలం రక్షణ రంగంలోనే కాకుండా వాతావరణ అంచనా, విపత్తు నిర్వహణలోనూ EOS-05 ఉపగ్రహం కీలక సేవలు అందించనుంది. విపత్తులను ముందే పసిగట్టే అత్యాధునిక టెక్నాలజీ ఇందులో పొందుపరిచారు. వాతావరణంలో జరిగే మార్పులను కచ్చితంగా అంచనా వేయడంతో పాటు తుఫాన్లు, భూకంపాలు వంటి ప్రకృతి ప్రకోపాలను నిమిషాల వ్యవధిలోనే గుర్తించే అద్భుత సామర్థ్యం ఈ శాటిలైట్ సొంతం. దీంతో విపత్తుల సమయంలో ముందస్తు హెచ్చరికలు జారీ చేసి, భారీ ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు ఈ సూపర్ శాటిలైట్ ఎంతగానో తోడ్పడనుంది.

# మరుగుతున్న మహాసముద్రం

మొదటి పేజీ తరువాయి

పసిఫిక్ సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సగటు కంటే 2.6 డిగ్రీల సెల్సియస్ పెరగడమే కాకుండా, కొన్ని లోతైన ప్రాంతాల్లో ఏకంగా 8 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా నమోదు కావడం శాస్త్రవేత్తలను షాక్‌కు గురిచేస్తోంది. 1950 నుంచి లెక్కిస్తున్న ఆధునిక వాతావరణ రికార్డుల్లోనే ఇది అత్యంత వేడిగా, అతి తీవ్రమైన ఎల్‌నినోగా చరిత్రకెక్కే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**భారత్‌పై ఎల్‌నినో దెబ్బ**


ఈ అసాధారణ వాతావరణ మార్పు భారత్‌కు అతిపెద్ద ఆందోళనగా మారింది. సాధారణంగా ఎల్‌నినో బలపడితే నైరుతి రుతుపవనాలు బలహీనపడి దేశంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయి. ఇప్పటికే భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనాలకు తగ్గట్లే ఆగస్టు నెలాఖరు నాటికి దేశంలో 16 శాతం వర్షపాత లోటు నమోదైంది. రాబోయే సెప్టెంబర్-నవంబర్ కాలంలో కూడా సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉంటాయని డబ్ల్యూఎంఓ స్పష్టం చేసింది. అయితే, హిందూ మహాసముద్రంలో ఏర్పడే 'పాజిటివ్ ఐఓడీ' అనుకూలిస్తే కొంతవరకు ఉపశమనం లభించే అవకాశమున్నప్పటికీ, వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొనే ప్రమాదముంది.

**2027 అత్యంత వేడి సంవత్సరంగా మారే ముప్పు**

ఎల్‌నినో ప్రభావం కేవలం ఒకే ప్రాంతానికి పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన కరువులు, ఊహించని వరదలు, భయంకరమైన వేడిగాలులను తీసుకురానుంది. దీనివల్ల 2027వ సంవత్సరం మానవాళి చరిత్రలోనే అత్యంత వేడిగా ఉండే సంవత్సరంగా పాత రికార్డులను తిరగరాస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ఎల్‌నినో సృష్టిస్తున్న ఈ ఆకస్మిక విపత్తులను తట్టుకోవడానికి, ఆహార భద్రత, ప్రజారోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రపంచ దేశాలు తక్షణమే ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను, అత్యవసర ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని డబ్ల్యూఎంఓ పిలుపునిచ్చింది.

# మృత్యుంజయులుగా ఇద్దరు కార్మికులు!

మొదటి పేజీ తరువాయి



ఘటన జరిగిన మూడు రోజుల తరవాత ఇటీవల ఓ చిన్నారి శిథిలాల నుండి ప్రాణాలతో బయటపడింది. ఇక ఇప్పుడు ఏకంగా తొమ్మిది రోజుల తరవాత సైతం ఇద్దరు వ్యక్తులు శిథిలాల నుండి ప్రాణాలతో బయటపడ్డారు. నేపాల్‌లోని త్రిశూలి 3ఏ జలవిద్యుత్ కేంద్రం నుండి ఇద్దరు కార్మికులను సహాయక సిబ్బంది రక్షించారు.

రెస్క్యూ సిబ్బంది జలవిద్యుత్ కేంద్రం వద్ద సంచరిస్తున్న సమయంలో సొరంగం లోపలి నుండి కేకలు వినిపించాయి. అవి విన్న వెంటనే సొరంగంలోపలికి వెళ్లి రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు వారికి శిథిలాల కింద ప్రాణాలతో కనిపించారు. వారిద్దరిని బయటకు తీసి రక్షించారు. తొమ్మిది రోజులుగా ఆహారం, నీరు లేకుండా బతికినవారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. విపత్తు జరిగిన తరవాత మొత్తం 900 మందికి పైగా కార్మికులు గల్లంతయ్యారని సహాయ బృందాలు తెలిపారు. వారిలో 40 మంది ఆచూకీ ఇంకా లభించలేదని చెబుతున్నాయి.

# ఎవరిపై వేటు.. ఎవరికి పీఠం?

మొదటి పేజీ తరువాయి

కేబినెట్ నుంచి తప్పించిన తరువాత ముగ్గురు బీసీ మహిళలకు కీలక పదవులు ఇచ్చారు. దీంతో కేబినెట్‌లోకి మరో మహిళను తీసుకోకుండా మూడు పదవులను పురుషులకు ఇస్తే ఎలా ఉంటుంది? ఒకవేళ మహిళలకు ఇవ్వాలంటే, బీసీ వర్గానికి చెందిన మహిళలు ఎవరు ఉన్నారు? అనే కోణంలో సమాచారాన్ని సేకరిస్తున్నట్లు తెలిసింది. అయితే విస్తరణలో బీసీ కోటాలో ఎమ్మెల్సీ విజయశాంతి పేరును అధిష్టానం పరిశీలిస్తున్నట్లు ప్రచారం ఉంది.

**పునర్వ్యవస్థీకరణతో అన్నింటికీ చెక్..**

ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు పూర్తవుతున్నందున కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరణ చేయాలని, పనితీరు సరిగా లేని మంత్రులను తొలగించి, కొత్తవారికి అవకాశం ఇవ్వాలనే డిమాండ్ ఉంది. ఈ క్రమంలో పునర్వ్యవస్థీకరణ చేస్తే ఎలా ఉంటుంది? ఎవరెవరిని తొలగించాలి? తొలగిస్తే తలెత్తే రాజకీయ ఇబ్బందులు ఏంటి? అనే కోణంలో కాంగ్రెస్ పెద్దలు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. అయితే పునర్వ్యవస్థీకరణ చేసేందుకు అధిష్టానం మొగ్గుచూపితే ఇద్దరు ముగ్గురు మంత్రులను తొలగించే అవకాశం ఉంది. వారి స్థానంలో కొత్తవారిని నియమించడంతోపాటు ఇంతకాలం కేబినెట్‌లో ప్రాతినిధ్యంలేని సామాజికవర్గాలు, జిల్లాలకు అవకాశం దక్కనుంది. అదే సమయంలో శాఖల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న మంత్రుల వద్ద ఉన్న శాఖలను తొలగించి, ఇతర శాఖలు కేటాయించే అవకాశం ఉంది.

**అన్ని వర్గాలకు ప్రయారిటీ..**

మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపడితే పనితీరు సరిగాలేని వారిని పక్కన పెట్టడం వల్ల అన్ని సామాజిక వర్గాలకు ప్రయారిటీ ఇచ్చే అవకాశం ఉంటుంది. దీంతో కాంగ్రెస్ అధిష్టానం హామీ ఇచ్చిన రాజగోపాల్‌రెడ్డితోపాటు మున్నూరు కాపు, లంబాడ, సామాజికవర్గాలకు పదవులు దక్కే చాన్స్ ఉంటుంది. అయితే చాలాకాలంగా మంత్రి పదవి కావాలంటూ పట్టుపడతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కేబినెట్‌లోకి తీసుకుని, ఆ స్థానంలో మంత్రి వివేక్‌ను స్పీకర్‌గా నియమిస్తే ఎలా ఉంటుంది? అనే కోణంలో అధిష్టానం ఆరా తీస్తున్నట్లు తెలిసింది. మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాల నేపథ్యంలో పలువురు నేతలు అప్పుడే తమ లాబీయింగ్‌ను మొదలుపెట్టారు. ఆ జాబితాలో స్పీకర్ గడ్డం ప్రసాద్, బాలునాయక్, రామ్ చంద్రనాయక్, విజయశాంతి, మదన్ మోహన్, ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

# 'బిలాంగింగ్'పై ఫుల్ క్లారిటీ!




**న్యూస్ డెస్క్, 04 సెప్టెంబరు (బిఎన్ఎస్):** కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆటోబయోగ్రఫీ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ప్రచురణకు సంబంధించి ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మొదట ప్రచురించాల్సిన పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంతో, ఇప్పుడు ప్రముఖ ప్రచురణ సంస్థ హార్పర్ కాలిన్స్ ఈ బుక్ ప్రింటింగ్ బాధ్యతలను చేపట్టింది. భారత ఉపఖండంలో ఈ బుక్ 'హార్పర్ కాలిన్స్' ఇండియా సంస్థ నవంబర్ 10న అధికారికంగా విడుదల చేయనున్నట్లుగా ప్రకటించింది.

అయితే, మాన్యువల్ స్క్రిప్ట్‌లో కొన్ని మార్పులు, చేర్పులు చేయాలని పెంగ్విన్ సంస్థ కోరడం, వాటిని సోనియా గాంధీ అంగీకరించకపోవడంతో ఆ డీల్ రద్దయినట్లు ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. ఈ వివాదానికి తెరదించుతూ హార్పర్ కాలిన్స్ నవంబర్ 10నే పుస్తకాన్ని మార్కెట్లోకి తీసుకురానున్నట్లుగా ఫుల్ క్లారిటీ ఇచ్చింది. పోస్ట్-వార్ ఇటలీలో బాల్యం, భారత్‌కు రావడం, రాజీవ్ గాంధీతో పరిచయం, ఆ తర్వాత జరిగిన విషాదాలు, రాజకీయ ప్రవేశం, 2004లో ప్రధానమంత్రి పదవిని తిరస్కరించడం వంటి అనేక ఆసక్తికరమైన వ్యక్తిగత, రాజకీయ విషయాలను ఈ పుస్తకంలో సోనియా గాంధీ ప్రజలతో షేర్ చేసుకోబోతున్నారు.

# పసికందుపై పైశాచికం



**న్యూస్ డెస్క్, 04 సెప్టెంబరు (బిఎన్ఎస్):** ఉత్తరప్రదేశ్‌లో దారుణం చోటు చేసుకుంది. మూడు నెలల పసికందుపై ఓ దుర్మార్గుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ ఘటన యూపీలోని మెయిన్ పురి జిల్లా బెవార్‌లో జరిగింది. పొరుగింట్లే ఉండే జితేంద్ర 35 అనే రాక్షసుడు కొంతకాలంగా పసికందుతో ఆడుకునేవాడు. పొరుగింటివాడు, తెలిసిన వ్యక్తే కావడంతో కుటుంబ సభ్యులు ఎలాంటి అనుమానం వ్యక్తం చేయలేదు. అయితే ఇటీవల చిన్నారి వద్ద ఎవరూ గమనించిన జితేంద్ర ఆడిస్తూ నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు.

అరగంట తరవాత ఇంటికి తీసుకువచ్చి విపరీతంగా ఏడుస్తుండగా మంచంపై పడుకోబెట్టి అక్కడ నుండి పరార్ అయ్యాడు. చిన్నారి ఏడుస్తుండటంతో వచ్చి చూసిన కుటుంబ సభ్యులు రక్త స్రావం అవ్వడాన్ని గమనించారు. వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించగా చిన్నారిపై అఘాయిత్యం జరిగినట్టు వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనపై తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, నిందితుడు జితేంద్రను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం చిన్నారి పరిస్థితి విషయమంగా ఉండటంతో డాక్టర్లు వైద్యం అందిస్తున్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# కృష్ణా జలాలపై మళ్లీ పంచాయతీ!




**న్యూస్ డెస్క్, 04 సెప్టెంబరు (బిఎన్ఎస్):** తెలుగు రాష్ట్రాల మధ్య తాగునీటి వాటాల కేటాయింపుపై కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో తీవ్రస్థాయిలో వాదనలు జరిగాయి. ప్రస్తుతం బోర్డు పరిధిలోని ఉమ్మడి జలాశయాల్లో 142 టీఎంసీల మేర లభ్యత ఉండగా, తాగునీటి అవసరాల దృష్ట్యా ఇరు రాష్ట్రాలకు 50:50 నిష్పత్తిలో సమానంగా నీటిని కేటాయించాలని తెలంగాణ ఈఎన్సీ బోర్డును కోరారు. అయితే ఆంధ్రప్రదేశ్ మాత్రం గతంలో ఉన్న తాత్కాలిక ఏర్పాటు ప్రకారం 66:34 నిష్పత్తిలోనే వాటాలు కేటాయించాలని పట్టుబట్టడంపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇప్పటికే పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా ఏపీ అక్రమంగా భారీగా నీటిని తరలించిందని తెలంగాణ ఈఎన్సీ ఆరోపించగా, నిబంధనలకు కట్టుబడే నీటిని తరలిస్తున్నామని ఏపీ అధికారులు తోసిపుచ్చారు.

మరోవైపు తాగునీటి అవసరాల నిమిత్తం 66:34 నిష్పత్తిలో ఏపీ వాటాగా 97 టీఎంసీలను విడుదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలని ఏపీ ఈఎన్సీ పట్టుబట్టారు. నాగార్జునసాగర్‌లో తెలంగాణ ప్రభుత్వం ఏకపక్షంగా జరుపుతున్న జలవిద్యుత్ ఉత్పత్తిని తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇరు రాష్ట్రాల ఇంజినీర్-ఇన్-చీఫ్‌లు తమ వాదనలకే మొగ్గుచూపడంతో నీటి పంపకాలపై ఎలాంటి ఏకాభిప్రాయం కుదరక సమావేశం తీవ్ర అసంతృప్తితో ముగిసిందని ఏపీ ఈఎన్సీ వెల్లడించారు. తాగునీటి కేటాయింపులపై ఇరు రాష్ట్రాలు రాజీలేని వైఖరిని ప్రదర్శించడంతో కృష్ణా జలాల పంచాయతీ మరోసారి అనిశ్చితికి దారితీసింది.

# సురేఖకు బీఆర్ఎస్ నో ఎంట్రీ!




**న్యూస్ డెస్క్, 04 సెప్టెంబరు (బిఎన్ఎస్):** తాజా పరిణామాలతో తెలంగాణ రాజకీయం ఒక్కసారిగా రసవత్తరంగా మారింది. మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ అయిన కొండా సురేఖ భవిష్యత్ కార్యాచరణపై జోరుగా చర్చ జరుగుతోంది. ఆమె కాంగ్రెస్?లోనే కొనసాగుతారా లేక హస్తానికి హ్యాండ్ ఇచ్చి మరో పార్టీలో చేరుతారా అనే దానిపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కొండా సురేఖ కాంగ్రెస్ ను వీడి ఇతర పార్టీలో చేరేందుకు ఆయా పార్టీలతో చర్చలు జరుపుతున్నారనే ప్రచారం వేళ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కొండా సురేఖ విషయంలో సంచలన వ్యాఖ్యలు చేశారు.

**తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వం:**

శుక్రవారం మీడియాతో చిట్ చాట్ లో మాట్లాడిన జగదీశ్ రెడ్డి.. కొండా సురేఖను మళ్లీ బీఆర్ఎస్ చేరుతారనే ప్రచారాన్ని ప్రచారాన్ని ఖండించారు. కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ రానివ్వంమని ఆమెను తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వమని స్పష్టం చేశారు. పార్టీని వీడి కాంగ్రెస్‌లోకి వెళ్లిన వారందరినీ తిరిగి చేర్చుకునే ప్రసక్తి లేదని, పార్టీ మారిన వారిలో కేవలం ఒకరిద్దరిని తప్ప మిగతా ఎవరినీ మళ్లీ బీఆర్ఎస్‌లోకి రానిచ్చేది లేదని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఇప్పటికే ఇద్దరు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని జగదీశ్ రెడ్డి బాంబు పేల్చారు.

**రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తే అమ్ముడుపోయినట్టే:**

కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై కూడా జగదీశ్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని బీఆర్ఎస్‌లోకి అసలు తీసుకోమన్నారు. ఆయనకు ఒకవేళ రేవంత్ రెడ్డి సర్కార్ మంత్రి పదవి ఇస్తే.. అది పూర్తిగా అమ్ముడుపోయినట్టే లెక్క అని వ్యాఖ్యానించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు తమ పార్టీ పూర్తి వ్యూహాలతో సిద్ధంగా ఉందని జగదీశ్ రెడ్డి వెల్లడించారు.

# సీఎం కుర్చీపై కవిత కన్ను!

మొదటి పేజీ తరువాయి

తన రాజకీయ ప్రత్యర్థులపై స్పందించిన కవిత.. హరీశ్‌రావు భార్య తనపై పోటీ చేస్తే స్వాగతిస్తానని సవాల్ చేశారు. గతంలో తాను హరీశ్‌రావుపై పోటీ చేస్తానని చెప్పిన విషయం వాస్తవమేనని గుర్తుచేశారు. ఇప్పుడు ఆయన భార్య తనపై పోటీ చేస్తే కూడా తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు రెడీగా ఉన్నానని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపైనా కవిత తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వ నిర్ణయాలు, ముఖ్యమంత్రి ప్రకటనల మధ్య పొంతన కనిపించడం లేదని ఆరోపించారు. ఇకపై రేవంత్‌రెడ్డి చర్యలను తుగ్లక్ చర్యలు అని చెప్పాల్సిన అవసరం లేదని.. రేవంత్‌రెడ్డిలా ఉన్నావ్ అంటే సరిపోతుందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. సీఎం పదవికి ఉండాల్సిన గౌరవాన్ని, హుందాతనాన్ని కాపాడాలని సూచించారు.

తెలంగాణలో ఇంటర్మీడియట్ విద్యను ఎత్తివేసే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని కవిత డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యను రద్దు చేయబోమని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంగా ప్రకటించాలని కోరారు. ఇంటర్మీడియట్ విద్యను రద్దు చేస్తే ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, బాలికలు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటర్ విద్య తెలంగాణలో బలమైన వ్యవస్థగా ఉందని, దానిని మార్చాల్సిన అవసరం లేదని అన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో పెట్టుకోవడం అంటే ప్రభుత్వానికి తీవ్ర ఇబ్బందులు తెచ్చుకోవడమేనని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన అంశంలో ప్రభుత్వం జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

విద్యా రంగానికి సంబంధించి గతంలో ఏర్పాటు చేసిన రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి నేతృత్వంలోని కమిషన్‌పైనా కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. ఆ కమిషన్‌కు 3 సంవత్సరాల సమయం కేటాయించి చివరకు దాని సిఫార్సులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ఇంటర్‌లో పాస్ శాతం 45 శాతానికి పెంచాలన్న సిఫార్సుపై కూడా ఆమె ప్రశ్నలు లేవనెత్తారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఓట్ల శాతాన్ని ప్రస్తావిస్తూ కవిత వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రస్తుతం మళ్లీ మరో కమిషన్ గురించి ప్రభుత్వం మాట్లాడుతోందని.. దాని నివేదిక ఎప్పుడు వస్తుంది, ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు.

'కేసీఆర్ ఎంత మనోవేదనకు గురవుతున్నారో ఆలోచించు'.. కవితపై ప్రశాంత్ రెడ్డి ఫైర్

తెలంగాణకు ఏటా సుమారు రూ.2 లక్షల కోట్ల ఆదాయం వస్తోందని పేర్కొన్న కవిత.. అందులో రూ.లక్ష కోట్లను విద్య, వైద్య రంగాలకు కేటాయించి ప్రజలకు ఉచితంగా మెరుగైన సేవలు అందించవచ్చని అన్నారు. ఇందుకు ప్రభుత్వానికి రాజకీయ సంకల్పం మాత్రమే అవసరమని వ్యాఖ్యానించారు. కవిత చేసిన సీఎం వ్యాఖ్యలు, హరీశ్‌రావు కుటుంబంపై చేసిన సవాలు, రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు.. తెలంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చకు తెరలేపాయి. ముఖ్యంగా తన రాజకీయ లక్ష్యాన్ని బహిరంగంగా వెల్లడించడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

# సీఎం అధ్యక్షతన 8వ కలెక్టర్ల కాన్ఫరెన్స్



**న్యూస్ డెస్క్, 04 సెప్టెంబరు (బిఎన్ఎస్):** మరోసారి కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు సిద్ధం అవుతున్నారు సీఎం చంద్రబాబు.. ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ఈ నెల 10, 11 తేదీల్లో 8వ కలెక్టర్ల సదస్సు జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రెండు రోజుల పాటు జరిగే ఈ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు రాష్ట్ర మంత్రులు, జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. జిల్లాల వారీగా ప్రభుత్వ కార్యక్రమాల అమలు, అభివృద్ధి లక్ష్యాలపై సదస్సులో విస్తృతంగా చర్చించనున్నారు.

**తొలి రోజు కీలక అంశాలపై సమీక్ష**

కలెక్టర్ల సదస్సు తొలి రోజు గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై ప్రధానంగా సమీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధి, జిల్లా వారీగా నిర్దేశించిన లక్ష్యాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. స్వర్ణ ఆంధ్ర--2047 జిల్లా రోడ్‌మ్యాప్‌లపై ప్రత్యేకంగా చర్చ జరగనుంది. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్, వివిధ సంక్షేమ పథకాల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తారు. ఆరోగ్యం, విద్యాశాఖల పనితీరుపై జిల్లా కలెక్టర్లతో చర్చించనున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పురోగతిపైనా సమీక్ష ఉంటుంది. జలధార కార్యక్రమం అమలు, పురోగతిపై కూడా కలెక్టర్ల నుంచి వివరాలు తీసుకోనున్నారు. జిల్లాల కలెక్టర్లు చేపట్టిన ఉత్తమ ఆవిష్కరణలకు ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేసి, వాటి వివరాలను సదస్సులో వివరిస్తారు.

**రెండో రోజు ఈ అంశాలపై చర్చ**

సదస్సు రెండో రోజు ఈ-గవర్నెన్స్, RTGS, PGRS పనితీరుపై సమీక్ష నిర్వహించనున్నారు. భూ పరిపాలనకు సంబంధించిన అంశాలతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాల కింద రాష్ట్రానికి అందుతున్న నిధులు, వాటి వినియోగంపై చర్చ జరగనుంది. జిల్లా కలెక్టర్లతో ఓపెన్ ఫోరం నిర్వహించి క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను నేరుగా చర్చించనున్నారు. జిల్లాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ఉన్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై ఈ వేదికలో చర్చించే అవకాశం ఉంది.

**శాంతిభద్రతలపై సమీక్ష.. సీఎం ముగింపు ప్రసంగం**

రెండో రోజు రాష్ట్రంలోని శాంతిభద్రతల పరిస్థితిపైనా సమగ్ర సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలెక్టర్ల సదస్సును ఉద్దేశించి ముగింపు ప్రసంగం చేయనున్నారు. రెండు రోజుల సదస్సులో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయడంపై దిశానిర్దేశం చేయనున్నారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. కాగా, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు.. వివిధ అభివృద్ధి కార్యక్రమాలు.. ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలు.. భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై ఎప్పటికప్పుడు కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ.. దిశానిర్దేశం చేస్తూ వస్తున్నారు సీఎం చంద్రబాబు..

# కేదార్లంకలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



కపిలేశ్వరపురం (బిఎన్ఎస్)సెప్టెంబర్ 04 :కపిలేశ్వరపురం మండలం కేదార్లంకలో సాదా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యానందం మరియు హిందూ ధార్మిక నాయకులు విచ్చేశారు. ముందుగా పలు ఆధ్యాత్మిక భజనా కార్యక్రమాలు ప్రారంభించారు. కేదార్లంక, వీధివార్లంక గ్రామాలకు చెందిన మహిళలు చిన్నారులు కోలాటం కార్యక్రమం ఎంతో ఉత్సాహభరితంగా జరిగాయి.ఈ సందర్భంగా పాలూరి మాట్లాడుతూ శ్రీకృష్ణుడు జీవితం ఎంతో ఆదర్శవంతంగా నడిచిందనీ, భగవద్గీత ద్వారా మనిషి ధర్మంగా ఎలా నడుచుకోవాలో నేర్పించిన మార్గదర్శమూర్తి శ్రీ కృష్ణ పరమాత్మ అని అన్నారు. అనంతరం కేదార్లంక గ్రామ పెద్దలు మరియు హిందూ ధార్మిక కార్యకర్తలు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేస్తున్న లక్ష్మీనారాయణను,గ్రామస్తులను పాలూరి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కేదార్లంక మాజీ సర్పంచ్ రంకిరెడ్డి వెంకటేశ్వరరావు, బిజెపి యువమోర్చ రాష్ట్ర కార్యదర్శి పాలూరి జయప్రకాశ్ నారాయణ, బిజెపి యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కోటిపల్లి దామోదర్, ఆర్ఎస్ఎస్ నాయకులు తొగరు సీతారామాంజనేయులు, సిద్ధంశెట్టి గంగారావు,కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు చోడ పనీడి నాగబాబు, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు అన్యం సత్యనారాయణ,ఆత్మ కమిటీ డైరెక్టర్ పాలాటి మాధవస్వామి, కేదార్లంక గ్రామపెద్దలు అన్యం శివాజీ, పోలిశెట్టి బ్రహ్మయ్య, అన్యం గోవిందు,తదితరులు మరియు గ్రామస్తులు హిందూ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వివేకా కేసులో 40 కోట్ల సుపారీ గుట్టు రట్టు.?



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 04: వివేకా హత్య కేసులో రూ. 40 కోట్ల సుపారీ గుట్టు తవ్వితీసేందుకు ఈడీ బరిలోకి దిగడంతో దర్యాప్తు కొత్త మలుపు తిరిగినట్టు సమాచారం. అప్రూవర్ దస్తగిరిని అధికారులు గంటల తరబడి ప్రశ్నించి, బ్యాంక్ స్టేట్‌మెంట్లు, ఆర్థిక లావాదేవీల పత్రాలను వెరీఫై చేసుకున్నారు. హత్య వెనుక జరిగిన రూ. 40 కోట్ల డీల్ నిజమేనని, తన వాటాగా రూ. 5 కోట్లు ఇస్తామన్నారని దస్తగిరి మరోసారి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. హత్యకు ముందు, ఆ తర్వాత జరిగిన భారీ నగదు మార్పిడి ఎవరి ఖాతాల నుంచి జరిగిందో ఈడీకి లెక్కలు. హత్యకు నిధులు సమకూర్చిన బడా రాజకీయ నేతల లింకులు, అసలు నిందితుల పేర్లు త్వరలోనే బయటపడే అవకాశాలు ఉన్నట్లు సమాచారం..

# మైదుకూరు మార్కెట్ యార్డులో 39 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

## ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్.



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 04: రైతులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మైదుకూరు మార్కెట్ యార్డులో రూ.39 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పుట్టా శంకుస్థాపన చేశారు. క్యాటిల్ షెడ్, కాంపౌండ్ వాల్, వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా మాట్లాడుతూ.. మార్కెట్ యార్డు చైర్మన్ ఏపీ రవీంద్ర ఆధ్వర్యంలో మైదుకూరు మార్కెట్ యార్డు అద్భుతంగా పనిచేస్తోందని అన్నారు. రైతులకు అవసరమైన మౌలిక వసతులను మరింత మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రూ.39 లక్షలతో క్యాటిల్ షెడ్, కాంపౌండ్ వాల్, వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందని, ఈ పనులు పూర్తయితే మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పుట్టా పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, మార్కెట్ యార్డు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో నిరంతరం కృషి కొనసాగుతుందని తెలిపారు.

# కమలాపురంలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు..



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 04: ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి... మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలలో భాగంగా ఉదయం నుండి హోమం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం బండలాగుడు పోటీలను మాజీ ఎమ్మెల్సీ పుత్త నరసింహారెడ్డి కమలాపురం శాసనసభ్యుడు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి ప్రారంభించారు. ఆలయం నిర్మించినప్పుడు నుండి కృష్ణాష్టమి పదో వార్షికోత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా బండ లాగుడు పోటీలు, ముగ్గుల పోటీలు, ఉట్టి కొట్టే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. మొదటి నుండి ఇప్పటి వరకు ప్రజలు ప్రత్యేక పూజలతో పాటు సాంస్కృతి కార్యక్రమాల్లో విరి,విగా పాల్గొంటున్నారని ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి తెలిపారు. కమలాపురం నియోజకవర్గం.. సస్య శ్యామలంగా ఉండాలని, ప్రస్తుత పరిస్థితులలో ఎల్ నినో ప్రభావంతో వర్షాభావం తక్కువ కావడంతో ప్రజలు తీవ్రని ఇబ్బందులు పడుతున్నారని, ఈ మేరకు సకాలంలో వర్షాలు బాగా కురిసి పాడి,పంటలు బాగా పండి నియోజకవర్గ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అలాగే వారి ఆశీస్సులు మా కుటుంబంపై ఎల్లవేళలా ఉండాలని, ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి కృష్ణాష్టమి వేడుకల కార్యక్రమ వేడుకలలో ఆ దేవ, దేవుడైన శ్రీకృష్ణ పరమాత్మను కోరుకున్నట్టు తెలిపారు.

# జమ్మలమడుగులో శ్రీ శ్రీ శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారి దివ్య ఆశీస్సులతో అష్టమి వేడుకలు..

## పట్టణ పురవీధుల్లో బ్యాండు మేళాల మధ్యన శ్రీ కృష్ణుని విగ్రహంతో ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక వారి కార్య నిర్వహణ ఆధ్వర్యంలో గ్రామోత్సవం



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 04: శ్రీ కృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని జమ్మలమడుగు పట్టణంలో శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారి దివ్య ఆశీస్సులతో, త్రైత సిద్ధాంతం వారి ఆధ్వర్యంలో అష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని తాడిపత్రి రోడ్డులోగల మునిరెడ్డి కాంప్లెక్స్ ఆవరణం నందు శ్రీ కృష్ణ జన్మాష్టమి పండుగ సందర్భంగా ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక వారి కార్యనిర్వహకుల అధ్యక్షతన శ్రీకృష్ణుని విగ్రహం ఏర్పాటుచేసి పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో పట్టణ పరిసర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో హాజరై అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహంతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచే శ్రీకృష్ణ భగవానునికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. స్వామివారిని పలురకాల సుగంధ పుష్పాలు, రంగు రంగుల పూలమాలలతో దివ్యంగా అలంకరించారు. ఈ సేవలో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు స్వామి వారిని దర్శించుకుని, శ్రీకృష్ణ భగవానునికి పలువురు భక్తులు పూలమాలలు సమర్పించి తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. అనంతరం శ్రీకృష్ణుడి విగ్రహంతో పట్టణంలోని పురవీధుల్లో పెద్ద ఎత్తున బ్యాండు మేళాలతో శ్రీకృష్ణుని విగ్రహ గ్రామోత్సవ ఊరేగింపు కార్యక్రమంలో ముందు భాగంలో కోలాటం నృత్యం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

# దన్నవాడ గ్రామానికి నువ్వు చేసిందేంటి ప్రభావతమ్మ..?

## వైసీపీ మైలవరం మండ లాధ్యక్షుడు దేవిరెడ్డి మహేశ్వర్ రెడ్డి..

బిఎన్ఎస్ న్యూస్ కడప జిల్లా సెప్టెంబర్ 04: జమ్మలమడుగు నియోజకవర్గం లోని, మైలవరం మండలం.. ధన్నవాడ గ్రామానికి మాజీ ఎంపీపీ అల్లె ప్రభావతి చేసిన అభివృద్ధి ఏమీ లేదని వైసిపి మైలవరం మండల అధ్యక్షుడు దేవిరెడ్డి మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక ఆర్.అండ్.బి అతిథి గృహం నందు ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవిరెడ్డి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. దన్నవాడ గ్రామానికి మైలవరం మండల మాజీ ఎంపీపీ అల్లె ప్రభావతి చేసిందేమీ లేదని, గ్రామ ప్రజలు ఆమెకు ఏమాత్రం రుణపడి లేరని విమర్శించారు. దన్నవాడ గ్రామంలోని పురాతన ఆంజనేయస్వామి ఆలయ పునరుద్ధరణ, పాత విగ్రహం విషయంలో అల్లె ప్రభావతి చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. గ్రామస్తులు అందరూ కలిసి ఆలయం పునరుద్ధరించామని, పురోహితుల సూచన మేరకు పాత విగ్రహానికి జలాభిషేకం జరిపామన్నారు. ఈ విషయాన్ని అల్లె ప్రభావతి వివాదానికి తెర లేపారని ఆరోపించారు. అనంతరం తనపై ఆరోపణలు చేస్తూ పల్లె ప్రభావతి మీడియా సమావేశం నిర్వహించారని అన్నారు. దన్నవాడ గ్రామంలోని పురాతన ఆంజనేయస్వామి ఆలయాన్ని గ్రామస్తులందరి సహకారంతో పునరుద్ధరించామని తెలిపారు.

ఆలయం వద్ద అల్లె ప్రభావతి పాత విగ్రహం తనకు కావాలని గొడవకు దిగారని ఆరోపించారు. ఈ క్రమంలో పోలీసులు ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తరలించిన అనంతరం గ్రామస్తులంతా కలిసి పాత విగ్రహానికి జలాభిషేకం నిర్వహించారని తెలిపారు. ఆలయ కార్యక్రమానికి గ్రామ ప్రజలందరూ మద్దతు తెలిపి ఐకమత్యంతో వైభవంగా నిర్వహించారని చెప్పారు. గ్రామ అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ హయాంలో తనకు లభించిన అవకాశంతో అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తు చేశారు. ఆమెను తాము ఎలాంటి పౌరుష పదజాలంతో దూషించలేదని స్పష్టం చేశారు. అల్లె ప్రభావతి ఆంజనేయస్వామి ఆలయంలో



రామ భజన చేస్తున్నప్పుడు ఒక్క సారిగా వచ్చి అందరినీ దుర్భాషలాడి గొడవలకు పాల్పడిందని, తిరిగి అల్ల ప్రభావతి నే తనను కొట్టారని, తమపై కేసులు నమోదు చేసిందని తెలిపారు. ఈ విషయంపై సంబంధిత పోలీసులు శాఖవారు విచారణ జరిపి ఎవరు తప్పు చేశారో వారిపై కేసులు నమోదు చేయాలని దేవిరెడ్డి మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

# గండి ఆంజనేయ స్వామిని దర్శించుకుందాం.. ప్లాస్టిక్ భూతానికి చెక్ పెడదాం.!!

## పవిత్ర పుణ్యక్షేత్రమైన గండి దేవస్థానం నుంచే ప్లాస్టిక్ రహిత మార్పుకు శ్రీకారం చుడుదాం.. గర్భగుడి దాకా చేరుతున్న ప్లాస్టిక్ కవర్లు.. పాపాఘ్ని నదిలోకి చేరుతున్న వ్యర్థాలు.. దేవాదాయ శాఖ అధికారుల ప్లాస్టిక్ పై దృష్టి సారించాలంటున్న భక్తులు..



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 04: శ్రావణమాసం సందర్భంగా కడపజిల్లా.. వేంపల్లి మండల పరిధిలోని ప్రసిద్ధ గండి శ్రీ వీరాంజనేయస్వామి క్షేత్రానికి భక్తుల రాక భారీగా పెరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు గండి క్షేత్రానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానంలో ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులు ఆకట్టుకుంటున్నాయి. క్షేత్రాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు భక్తులకు అవసరమైన వసతులు కల్పించేందుకు దేవాదాయ అధికారులు చేస్తున్న కృషి అభినందనీయం. అయితే ఇంతటి పవిత్రమైన క్షేత్రంలో ప్లాస్టిక్ వినియోగం మాత్రం ఆందోళన కలిగించే స్థాయిలో కొనసాగుతుండటం భక్తులను కలవరపెడుతోంది. శ్రావణమాసం ప్రారంభమై మూడు వారాలు గడిచినా దేవస్థాన పరిసరాలతో పాటు భక్తులు సంచరించే ప్రాంతాల్లో, చివరకు గర్భగుడి వైపు కూడా ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్వామివారి దర్శనానికి భక్తులు పంచెకట్టుతో, సాంప్రదాయ దుస్తులతో రావాలని అధికారులు సూచిస్తున్న నేపథ్యంలో.. అదే స్థాయిలో దేవస్థాన పవిత్రతను కాపాడేందుకు ప్లాస్టిక్ నియంత్రణపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని భక్తులు కోరుతున్నారు. గండి క్షేత్రం పక్కనే ప్రవహించే పవిత్ర పాపాఘ్ని నది భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలతో ముడిపడి ఉంది. అలాంటి పవిత్ర నదిలోకి ప్లాస్టిక్ కవర్లు, ప్యాకింగ్ వ్యర్థాలు, ఇతర చెత్త చేరడం ఆందోళన కలిగించే విషయం. దేవస్థాన పరిసరాల్లో, నది తీరంలో పడేసే ప్లాస్టిక్ వ్యర్థాలు వర్షాలు, వరదల సమయంలో నదిలోకి చేరే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్ ముక్కలు, కవర్లు నీటిలో కలవడంతో నది పర్యావరణ వ్యవస్థ దెబ్బతినే అవకాశం అధికంగా ఉందంటూ భక్తుల అభిప్రాయపడుతున్నారు. పవిత్రమైన పాపాఘ్ని నదిని కలుషితం చేసి.. అదే నీటిని మనం వినియోగిస్తే పరిస్థితి ఎలా ఉంటుంది? అనే ప్రశ్న ప్రతి ఒక్కరిలోనూ తలెత్తాల్సిన అవసరం ఉందంటున్నారు భక్తులు.

కలుషిత నీటిని వినియోగించడం వల్ల నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు, అంటువ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా శ్రావణమాసంలో గండికి వచ్చే చిన్నారులు, వృద్ధులు, మహిళలు, ఇతర భక్తుల ఆరోగ్యంపై అపరిశుభ్ర వాతావరణం ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. అందువల్ల పాపాఘ్ని నది పరిరక్షణ కేవలం పర్యావరణ సమస్య మాత్రమే కాదు.. ప్రజా రోగ్యానికి సంబంధించిన అంశం కూడా. మన హిందూ సంప్రదాయంలో దేవాలయ దర్శనానికి ఎన్నో ఆచారాలు, నియమ నిబంధనలు ఉన్నాయి. పరిశుభ్రమైన దుస్తులు ధరించడం, పవిత్రతను పాటించడం, పూజా విధానాలను గౌరవించడం, వంటి సంప్రదాయాలను భక్తులు తర,తరాలుగా పాటిస్తున్నారు. అయితే కాలానుగుణంగా మారుతున్న జీవనశైలిలో ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగింది. చేతిలో చిన్న ప్లాస్టిక్ కవర్‌తో మొదలైన అలవాటు నేడు దేవాలయాల ప్రాంగణాలను, నదీ తీరాలను, సైతం ఆక్రమించే స్థాయికి చేరింది. దేవాలయం అంటే కేవలం భక్తులు వచ్చి వెళ్లే ప్రదేశం కాదు. అది మన సంస్కృతి, సంప్రదాయం, ఆధ్యాత్మికతకు ప్రతీక. అలాంటి పవిత్ర ప్రదేశాల్లో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయడం వల్ల వాటి ప్రభావం ఒక్కరోజుతో ముగిసిపోదు. అవి నేలలో, నీటిలో సంవత్సరాల తరబడి ఉండిపోయే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్ వ్యర్థాలు నదిలోకి చేరితే చేపలు, నీటిలోని ఇతర జీవులు వాటిని ఆహారంగా భావించి మింగే ప్రమాదం ఉంటుంది. పశువులు, పక్షులు కూడా ప్లాస్టిక్ కవర్లను తినడంతో వాటి ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. ఇలా పర్యావరణ వ్యవస్థలోని జీవజాతులపై ప్రభావం పడుతూ పోతే కాలక్రమేణా ప్రకృతి సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉంది. చివరకు దాని ప్రభావం మళ్లీ మనుషులపైనే పడుతుంది. అందుకే ప్లాస్టిక్ నియంత్రణ అనేది కేవలం దేవస్థానం పరిశుభ్రతకు సంబంధించిన అంశంగా కాకుండా మన భవిష్యత్ తరాల భద్రతకు సంబంధించిన బాధ్యతగా చూడాల్సిన అవసరం ఉంది. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రజల్లో పూర్తిస్థాయిలో మార్పు రావడం లేదు. ఈ పరిస్థితుల్లో ప్లాస్టిక్ రహిత ఉద్యమానికి దేవాలయాలే నాంది పలికితే దాని ప్రభావం సమాజంపై బలంగా పడే అవకాశం ఉంది. గండి దేవస్థానంలోకి ప్లాస్టిక్ కవర్లను తీసుక రాకుండా క్రమంగా నిబంధనలు అమలు చేయాలి. ప్రవేశ ద్వారాల వద్ద ప్లాస్టిక్ నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేసి భక్తులకు అవగాహన కల్పించాలి. పూజా సామగ్రి, ప్రసాదాలు, ఇతర వస్తువులను కాగితపు సంచులు, వస్త్ర సంచులు లేదా పర్యావరణ రహిత ప్యాకేజింగ్‌లో అందించే విధానాన్ని తీసుకురావాలి.

**ప్లాస్టిక్ తీసుకురావద్దు.. పాపాఘ్ని నదిని కలుషితం చేయవద్దు..**

పర్యావరణాన్ని కాపాడండి అనే సందేశాలతో అవగాహన బోర్డులు ఏర్పాటు చేయాలి.

ప్లాస్టిక్ నియంత్రణ బాధ్యతను కేవలం భక్తులపైనే మోపడం సరికాదు. దేవస్థాన అధికారులు, జిల్లా యంత్రాంగం, స్థానిక సంస్థలు సమన్వయంతో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. దేవస్థానంలో ప్లాస్టిక్ వినియోగంపై స్పష్టమైన నిబంధనలు రూపొందించి, వాటి అమలును పర్యవేక్షించేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలి. ఒక్కరోజు లేదా ప్రత్యేక పర్వదినాల్లో మాత్రమే కాకుండా ఏడాది పొడవునా ప్లాస్టిక్ నియంత్రణను నిరంతర కార్యక్రమంగా కొనసాగించాలి.

దేవస్థాన ప్రాంగణంతో పాటు పాపాఘ్ని నది పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలి. తడి, పొడి చెత్తకు వేర్వేరు డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలి. నదిలోకి చెత్త చేరకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలి.గండి క్షేత్రం కేవలం ఆధ్యాత్మిక కేంద్రం మాత్రమే కాదు.. వేలాది మంది భక్తులకు స్ఫూర్తినిచ్చే పవిత్ర ప్రదేశం. ఇక్కడ తీసుకునే ప్రతి మంచి నిర్ణయం ఇతర దేవాలయాలకు కూడా ఆదర్శంగా నిలిచే అవకాశం ఉంది.

**గండి అంజన్న ను దర్శించుకుందాం.. దేవాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం..**

పాపాఘ్ని నదిని పవిత్రంగా కాపాడుదాం అనే నినాదంతో గండి దేవస్థానం ముందుకు సాగాలి. స్వామివారి దర్శనానికి పంచెకట్టుతో రావాలని భక్తులకు సూచిస్తున్న అధికారులు.. అదే సమయంలో ప్లాస్టిక్ రహిత గండి క్షేత్రానికి, పరిశుభ్రమైన పాపాఘ్ని నదికి భక్తులు సహకరించాలని పిలుపునివ్వాలి. భక్తులు కూడా తమ వంతు బాధ్యతగా ప్లాస్టిక్ కవర్లను దేవస్థానానికి తీసుకురాకుండా, నదీ తీరంలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా సహకరించాలి.

పవిత్రత అంటే కేవలం ఆచారాలు పాటించడం మాత్రమే కాదు.. ప్రకృతిని కాపాడటమూ పవిత్రమైన బాధ్యతే. గండి వీరాంజనేయస్వామి సన్నిధి నుంచి ప్లాస్టిక్‌కు నో.. పాపాఘ్నికి రక్ష.. పర్యావరణానికి జై అనే సందేశం వెలువడితే.. అది గండి క్షేత్రానికే కాకుండా యావత్ సమాజానికి

ఆదర్శంగా నిలుస్తుంది. ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టే తొలి అడుగు కనీసం దేవాలయాల నుంచైనా ప్రారంభిద్దాం.

పవిత్ర పాపాఘ్ని నదిని కాపాడుదాం. గండి నుంచే ఆ మార్పుకు శ్రీకారం ప్రారంభిద్దాం.. అంటూ పెద్ద ఎత్తున భక్తులు తమ, తమ వ్యక్తిగత అభిప్రాయాలను తెలియజేస్తున్నారు.

# ముద్దనూరు.. పులివెందుల.. ముదిగుబ్బ రైల్వే లైన్‌కు గ్రీన్ సిగ్నల్..

## పులివెందుల.. ముద్దనూరు ప్రజల ఎన్నో ఏళ్ల కల నెరవేరిన వేళ




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 04: ఆంధ్రప్రదేశ్‌లో మరో కొత్త రైల్వే లైన్‌కు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఎట్టకేలకు కడపజిల్లా.. పులివెందులకు రైల్వే ప్రాజెక్టు రానుంది. కడప.. బెంగళూరు రైల్వే మార్గాన్ని పులివెందుల మీదుగా ఏర్పాటు చేయడానికి సన్నాహాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ముద్దనూరు.. పులివెందుల.. ముదిగుబ్బ..

శ్రీసత్యసాయి ప్రాంతాల మీదుగా సుమారు 110 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి రైల్వే బోర్డు ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ. 2,505.89 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ప్రతిపాదిత మార్గంలో ముద్దనూరు, చిన్నదుద్యాల, మల్లెల, మదూరు, పులివెందుల తదితర ప్రాంతాల్లో రైల్వే స్టేషన్లు ఏర్పాటు చేసే ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోంది. ముదిగుబ్బ వైపు కూడా రెండు స్టేషన్లను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ రైల్వే లైన్ పూర్తయితే కడపజిల్లా పశ్చిమ ప్రాంతంతో పాటు పులివెందుల, ముద్దనూరు పరిసర ప్రాంతాల ప్రజలకు రైలు రవాణా సౌకర్యం మెరుగుపడి, ప్రాంతీయ అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది. ఇదిలా ఉండగా ఓబులవారిపల్లె.. గుంతకల్లు మధ్య మరో రెండు లైన్ల నిర్మాణానికి కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఓబులవారిపల్లె.. రేణిగుంట మధ్య రెండు రైల్వే లైన్లు ఉండగా, మూడో లైన్ నిర్మాణానికి కూడా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్టులకు సంబంధించి తదుపరి కార్యాచరణపై ఉన్నతాధికారుల నుంచి త్వరలో కీలక ఆదేశాలు వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# సిద్దవరంలో శ్రీక్రిష్ణమందిరంలో ప్రత్యేక పూజలు



నెల్లూరు జిల్లా రాపూరు (బిఎన్ఎస్)నెల్లూరు జిల్లాలోని రాపూరు మండలంలోని సిద్దవరం గ్రామంలోని బి.సి.కాలనీలో శ్రీశ్రీశ్రీ రుక్మిణీ సమేత శ్రీ రాధక్రిష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఉదయం అభిషేకం, ప్రత్యేక పూజలు అనంతరం అన్నదాన కార్యక్రమం సిద్దవరం గ్రామస్తులు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు.

# రాపూరు లో వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



నెల్లూరు జిల్లా రాపూరు (బిఎన్ఎస్): -నెల్లూరు జిల్లా రాపూరు మద్దెలమడుగు సెంటర్‌లో వేంచేసియున్న రాధా సమేత గోపాలకృష్ణ స్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని, స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. దర్శనానంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ చైర్మన్ శశి రెడ్డి తమ సొంత నిధులతో భక్తుల కోసం అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తుల గోవింద నామస్మరణలు, శ్రీకృష్ణుని కీర్తనలతో మద్దెలమడుగు సెంటర్ ప్రతిధ్వనించింది. వేడుకల్లో స్థానిక ప్రజలు, ఆధ్యాత్మికవేత్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు భక్తులకు శ్రీకృష్ణుని సందేశాన్ని, భగవద్గీత సారాంశాన్ని వివరిస్తూ, నిత్య జీవితంలో స్వామివారి బోధనల ప్రాముఖ్యతను గుర్తుచేశారు.

# చిరునవ్వు కోసం చేసిన సేవ

## -మానవత్వానికి ముగ్గురి చిరునామా



**బిఎన్ఎస్ న్యూస్, పామిడి.**

అన్నదమ్ముల మధ్య అనుబంధాలు తల్లిదండ్రుల మధ్య ప్రేమలు కరువవుతున్న ఈ రోజుల్లో మానవత్వానికి ప్రతిరూపంగా నిలిచారు ముగ్గురు యువకులు. రోడ్డుపక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న ఓ గుర్తుతెలియని వ్యక్తిని చేరదీసి స్నానం చేయించి భోజనం పెట్టి ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.వారి సేవాభావం ఇప్పుడు స్థానికంగా అభినందనలు అందుకుంటోంది.అనంతపురం జిల్లా పామిడి తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఓ గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు.అటుగా వెళ్తున్న ఆరోగ్యశ్రీ బాబు, నాగాసముద్రం అంజి, వెంకటంపల్లి రవీంద్ర నాయక్ అతడిని గమనించారు.అపస్మారక స్థితిలో ఉన్న ఆ వ్యక్తిని చూసి చలించిపోయిన వారు ముందుగా అతనికి స్నానం చేయించారు.ఆకలితో ఉన్న వ్యక్తికి భోజనం పెట్టారు అనంతరం గాయాలతో బాధపడుతున్న అతడిని పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందేలా చేశారు.ప్రస్తుతం సమాజంలో మానవ సంబంధాలు దూరమవుతున్న తరుణంలో ఎలాంటి పరిచయం లేని ఓ వ్యక్తిని సొంత మనిషిలా భావించి సేవ చేయడం పలువురిని కదిలించింది.కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని చాటి చెప్పారు ఈ ముగ్గురు చికిత్స అనంతరం ఆ వ్యక్తి ముఖంలో కనిపించిన చిరునవ్వును చూసి ఎంతో సంతోషంగా అనిపించిందని వారు తెలిపారు.మనిషికి మనిషే తోడని ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే అసలైన మానవత్వం అంటూ పలువురు వారి సేవాభావాన్ని అభినందిస్తున్నారు. ఈ ఘటన ద్వారా ప్రేమ, ఆప్యాయతలు తగ్గుతున్న ఈ రోజుల్లో కూడా మానవత్వం ఇంకా బతికే ఉందని నిరూపించారు ఈ ముగ్గురు యువకులు.

# అధికార పార్టీలో ఉంటూ..సొంత పార్టీకి వెన్నుపోటా?

- పార్టీలో ఉంటూ ప్రత్యర్థులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు
- ఎమ్మెల్యే కార్యక్రమాలకు దూరం..గ్రూపు రాజకీయాలతో పార్టీకి గండి
- పార్టీ వ్యతిరేక కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలి: మాజీ ఎంపీటీసీ బొల్లెపెల్లి మధు



**బిఎన్ఎస్ న్యూస్ అయినవోలు, సెప్టెంబర్ 4**

అధికార పార్టీలో పదవులు అనుభవిస్తూ..అదే పార్టీని బలహీనపరిచేలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు అయినవోలు మండల రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ ప్రత్యర్థి పార్టీ కార్యకలాపాలకు పరోక్షంగా సహకరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే పాల్గొంటున్నప్పటికీ, పార్టీలోని కొందరు నాయకులు కావాలనే వాటికి దూరంగా ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.పార్టీ కార్యక్రమాల కంటే వ్యక్తిగత ఆధిపత్యానికే ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు పార్టీ శ్రేణుల్లో వినిపిస్తున్నాయి.స్థానిక ఎమ్మెల్యే నాయకత్వాన్ని గౌరవించకుండా అహంకారపూరిత వ్యాఖ్యలు చేస్తూ పార్టీ శ్రేణుల్లో విభేదాలు సృష్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.వ్యక్తిగత ఇమేజ్ కోసం రాజకీయాలు చేయడం వల్ల పార్టీకి నష్టం జరుగుతోందని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది.స్థానిక ఎన్నికల సమయంలో సొంత పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా అనుచరులను ఇతర పార్టీల వైపు మళ్లించారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. పార్టీ గుర్తుపై గెలిచిన వార్డు సభ్యులపై ఒత్తిడి తెచ్చి ప్రత్యర్థి పార్టీ సర్పంచ్‌కు మద్దతు ఇవ్వాలని కోరినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వం చేపట్టిన వెయ్యి రోజుల పాలనా కార్యక్రమానికి సైతం దూరంగా ఉండటంపై పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.మరోవైపు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ప్రత్యేక గ్రూపును ఏర్పాటు చేసి పార్టీని అంతర్గతంగా బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.అధికార పార్టీలో కొనసాగుతూనే బీఆర్ఎస్ కార్యక్రమాలకు పరోక్షంగా మద్దతు ఇస్తున్నారనే ఆరోపణలు రాజకీయంగా మరింత వేడి పెంచుతున్నాయి.పార్టీ నాయకత్వంతో కలిసి ప్రజా సమస్యలపై పనిచేయాల్సిన సమయంలో ప్రత్యర్థి శిబిరంతో సన్నిహితంగా వ్యవహరించడం వెనుక ఉద్దేశమేంటని పార్టీ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని మాజీ ఎంపీటీసీ బొల్లెపెల్లి మధు పీసీసీ అధ్యక్షుడిని డిమాండ్ చేశారు.ఆరోపణలు నిజమని తేలితే పార్టీ క్రమశిక్షణ ప్రకారం సస్పెన్షన్‌తో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.పార్టీలో ఉంటూ పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా పనిచేసే వారికి అడ్డుకట్ట వేయాలని ఆయన అన్నారు.

# ప్రజా సమస్యలపై గులాబీ సైన్యం గర్జన.. ఏటూరునాగారంలో భారీ నిరసన

- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో అవినీతి--అక్రమాలే రాజ్యమేలుతున్నాయి
- ఆరు గ్యారెంటీలు.. 420 హామీలు ఏమయ్యాయి? ప్రజలకు లెక్క చెప్పాలి
- విమర్శలు కాదు.. హామీల లెక్కలు చెప్పండి: లక్ష్మణ్ బాబు




**బిఎన్ఎస్ ఏటూరునాగారం, సెప్టెంబర్ 4:**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఏటూరునాగారంలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టారు. ఓడగూడెం నుంచి బస్టాండ్ వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర ర్యాలీ నిర్వహించి, ధర్నా చౌక్ వద్ద మహిళలతో కలిసి వంటావార్పు చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్, నూతన బస్టాండ్--డిపో, గోదావరి కరకట్ట, పోడు భూములకు పట్టాలు, గిరిజన యువతకు ఉపాధి వంటి అంశాలపై మంత్రి సీతక్క సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా గత ప్రభుత్వాన్ని నిందించడానికే పరిమితమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు విమర్శించారు. ఏటూరునాగారంలో నిర్వహించిన నిరసనలో ఆయన మాట్లాడుతూ రైతులు యూరియా కోసం క్యూలలో నిలబడే పరిస్థితి ఎందుకు వచ్చిందో చెప్పాలని, రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.500 గ్యాస్, పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి హామీల అమలుపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ప్రజలు కాంగ్రెస్ పాలనను గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఏటూరునాగారాన్ని రెవెన్యూ డివిజన్ చేస్తామన్న హామీ ఏమైందని, నూతన బస్టాండ్--డిపో నిర్మాణానికి నిధులు, టెండర్లు ఎక్కడున్నాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ప్రశ్నించారు. గోదావరి వరదల నుంచి ప్రజలను రక్షించేందుకు కరకట్ట నిర్మాణం ఎప్పుడు చేపడతారో చెప్పాలని డిమాండ్ చేశారు. కమలాపూర్ ఫ్యాక్టరీని ఎందుకు ప్రారంభించలేదని, స్థానిక గిరిజన యువతకు ఉపాధి ఎప్పుడు కల్పిస్తారో స్పష్టం చేయాలని కోరారు. ఐటీడీఏను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏటూరునాగారంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఓడగూడెం నుంచి బస్టాండ్ వరకు సాగిన ర్యాలీ అనంతరం ధర్నా చౌక్ వద్ద వంటావార్పుతో నిరసన తెలిపారు. బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ పోడు భూముల సమస్య, గిరిజనుల ఉపాధి, రైతుల సమస్యలు, పెన్షన్లు, సంక్షేమ పథకాలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి మహిళలు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 33 నెలల పాలన అనంతరం కూడా ప్రతి సమస్యకు గత ప్రభుత్వాన్ని కారణంగా చూపడం సరికాదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు అన్నారు. ములుగు నియోజకవర్గ ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ములుగులో తమది "జనతా గ్యారేజ్" అని, బడుగు బలహీన వర్గాల సమస్యలకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. తమ నిరసన కార్యక్రమాలకు అడ్డంకులు సృష్టించినా ప్రజా మద్దతుతో ఉద్యమాలు కొనసాగిస్తామని, ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేసే రాజకీయాలకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్చార్జ్ బడే నాగజ్యోతి, పోరిక గోవింద్ నాయక్, తుమ్మ మల్లారెడ్డి, తాటి కృష్ణ, భూక్య జంపన్న, గడదాసు సునీల్ కుమార్, కాకులమర్రి శ్రీలత, ఎండి వలీ బాబా, కూనూరు అశోక్ గౌడ్, ఖాజా పాషా, ఎండి సర్దార్ పాషా, కాకులమర్రి ప్రదీప్ రావు, సప్పిడి రాంనర్సయ్య, కాక వెంకటేశ్వర్లు, అంతటి విజయ నాగరాజు, తూరం పద్మ, ఈసం స్వరూపతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# నవీన్ కుమార్ సోదరి వివాహ వేడుకకు ఎర్రబెల్లి దంపతులు



**బిఎన్ఎస్ న్యూస్ పాలకుర్తి సెప్టెంబర్ 04**

బీఆర్ఎస్ పార్టీ పాలకుర్తి మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ కుమార్ సోదరి వివాహ వేడుక యాదగిరిగుట్టలోని సాహితీ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఉషమ్మ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఎర్రబెల్లి దయాకర్ రావు, ఉషమ్మ దంపతులు ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు, బంధువులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# గణేష్ ఉత్సవాలపై పీస్ కమిటీ సమావేశం



**బిఎన్ఎస్ న్యూస్ పాలకుర్తి, సెప్టెంబర్ 4**

రాబోయే గణేష్ చతుర్థి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పాలకుర్తి పోలీస్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవ పీస్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఎస్ఐ డి. పవన్ కుమార్ తెలిపారు.పాలకుర్తి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, డీజే ఆపరేటర్లు, డీజే యజమానులు రేపు ఉదయం 10 గంటలకు పాలకుర్తి పోలీస్ స్టేషన్‌లో జరిగే సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, పోలీసుల సూచనలు, నిబంధనలపై సమావేశంలో చర్చించనున్నట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి ఉత్సవ కమిటీ సభ్యులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# హైవేపై ఆర్టీసీ బస్సు బోల్తా.. డ్రైవర్ మృతి



జుక్కల్,బిఎన్ఎస్: కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం పరిధిలోని జాతీయ రహదారిపై కల్వర్టు గోడను ఢీకొట్టి ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి బిచ్కుంద వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటన సమయంలో బస్సులో 13 మంది ప్రయాణికులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను బిచ్కుంద ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న బాన్సువాడ డీఎస్పీ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బస్సులో ఇరుక్కున్న డ్రైవర్ మృతదేహాన్ని బయటకు తీశారు.

# నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో సీఎం రేవంత్ పర్యటన



హైదరాబాద్,బిఎన్ఎస్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో పర్యటించారు. నారాయణపేట జిల్లా మద్దూరులో ప్రభుత్వం కొత్తగా నిర్మిస్తున్న సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల పనులను సీఎం పరిశీలించారు. పాఠశాల నిర్మాణ ప్రణాళికలను పరిశీలించి ప్రాంగణమంతా కలియతిరిగి అధికారులకు పలు సూచనలు చేశారు. భూములిచ్చిన రైతులతో మాట్లాడారు. ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి వారి నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఆ తర్వాత వికారాబాద్ జిల్లా హకీంపేట చేరుకున్న సీఎం.. విద్యా హబ్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.